క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మాధురి


డాక్టర్ వై.మాధురి

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ యర్రా మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సర కాలంగా ఇదే ఆసుపత్రిలో ఆమె ఎంఎస్ గైనకాలజిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సీనియారిటీలో భాగంగా మాధురికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం డీసీహెచ్ఎస్ ఏలూరు నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన మాధురిని ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఆచార్యుల సేవలు ఎనలేనివి


ఆచార్యులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం: పెన్షనర్స్ అసోసియేషన్ నరసాపురం యూనిట్ మాజీ కార్యదర్శి వీఎస్ఎస్ ఆచార్యులు సేవలు ఎనలేనవని సంఘం జిల్లా అధ్యక్షుడు వి.హరికుమార్ అన్నారు. ఇటీవల మృతిచెందిన ఆచార్యులు సంతాప సభను సోమవారం స్థానిక యూనిట్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆచార్యులు చిత్ర పటానికి అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం ఆచార్యులు ఎంతో కష్టపడ్డారన్నారు. యూనిట్ బలోపేతం కోసం కృషిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.మార్కండేయులు, బి.ఆనందరాజు, ఆర్ఆర్‌కే రాజు, రంగినీడి రామకృష్ణ, కమిమెళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

పశువైద్యశాల వైద్యునిగా సత్యనారాయణ


డాక్టర్ జి.సత్యనారాయణ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వెటర్నరీ ఆసుపత్రి వైద్యునిగా జి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం కార్యాలయం నుంచి పాలకొల్లుకు బదిలీపై వచ్చినట్టు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వేయింగ్ మిషన్, ఆపరేషన్ థియేటర్, ఆటో క్లేవ్ వంటి సౌకర్యాలు ఉంటే మరింత మెరుగైన వైద్యం అందించవచ్చని చెప్పారు. సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆవు దూడకు ఈ సందర్భంగా ఆయన చికిత్స చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సత్యనారాయణకు ఆసుపత్రి సిబ్బంది సతీష్ రెడ్డి, నెస్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు మనీష్ గౌడ్, సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వడలిలో వికసిత్ భారత్ కార్యక్రమం


వడలి పంచాయతీ వద్ద వికసిత్ భారత్ కార్యక్రమం

పెనుగొండ: ప్రధాని నరేంద్ర మోదీ అధికారం చేపట్టి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వడలి పంచాయతీ వద్ద వికసిత్ భారత్ అమృత్ కాల్ సుపరిపాలన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బీజేపీ పాలనలో భారత్ అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, ఎంపీటీసీలు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన భవానీ బాబి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌ల అందజేత


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ను అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): విభిన్న ప్రతిభావంతులు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా రూ.2.88 లక్షల విలువగల ల్యాప్‌టాప్‌లను ఉచితంగా అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన ఎనిమిది మంది ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెగ్యులర్ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు


యలమంచిలిలో నీరు అడుగంటిన మంచినీటి చెరువు

యలమంచిలి: మండలంలోని 16 గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నారు. జూన్ 16వ తేదీ వచ్చినప్పటికీ కాల్వ నీరు రాకపోవడంతో దానిపై ఆధారపడిన మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు మండల కేంద్రం యలమంచిలిలో సుమారు 5 వేలకు పైబడి జనాభా ఉన్నారు. ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చడానికి 12 ఎకరాల చెరువు ఉంది. చెరువులో నీరు అడుగంటిపోవడంతో కుళాయిల ద్వారా ఇస్తున్న నీరు ఊలు కంపు కొడుతూ తాగడానికి పనికి రావడం లేదు. దీంతో పంచాయతీ అధికారులు గ్రామంలోని గోదావరి ఒడ్డున బోరు వేసి, ఆ నీటిని తోడి ట్యాంకుకు ఎక్కించి సరఫరా చేస్తున్నారు. చెరువు నీరు తాగడానికి అలవాటు పడిన ప్రజలు బోరు నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెరువుకు చించినాడ చానల్ ద్వారా నీరు వస్తుంది. ఈ ఏడాది కాలువలకు నేటికీ నీరు రాకపోవడంతో మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మరో 15 రోజులు ఇబ్బందులే..

విజ్జేశ్వరం–నరసాపురం ప్రధాన కాల్వ నీరు వదిలినా బ్యాంకు కెనాల్‌పై కాంక్రీట్ పనులు పూర్తికాకపోవడంతో కాల్వ నీరు రాలేదు. బ్యాంకు కెనాల్‌కు నీరు వచ్చి, అవి కింద ఉన్న వడ్డిలంక, చించినాడ కాల్వలకు వచ్చేసరికి మరొక 15 రోజులైనా పడుతుంది. అప్పటివరకు బోరు నీటిని తాగడం మా వల్ల కాదంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

వైరలవుతున్న తెలుగుదేశం నాయకుడి వీడియో..

ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లడానికి యలమంచిలి గ్రామానికి చెందిన ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడు ప్రయత్నిస్తే, ఆయనకు మంత్రి అందుబాటులోకి రాలేదు. దీంతో సదరు నాయకుడు చెరువు సమస్యపై ఒక వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది బాగా వైరలవుతోంది. ఆ వీడియోలో సదరు నాయకుడు మాట్లాడుతూ గ్రామంలో ఏడు చెరువులు ఉన్నాయని, కానీ ఒకే చెరువును మంచినీటి కోసం ఉపయోగిస్తున్నారని చెప్పారు. కొన్ని చెరువులు ఆక్రమణలకు గురవగా, మరికొన్ని చెరువులను పంచాయతీ పాట పెట్టి చేపల పెంపకానికి ఇచ్చిందని తెలిపారు. ‘జలవనరుల శాఖ మంత్రి కొలువులో తాగునీటి కరువా’ అంటూ ప్రజలు విమర్శిస్తున్నారని చెప్పారు. దీంతో పార్టీకి కూడా చాలా చెడ్డ పేరు వస్తోందని వాపోయారు. కనీసం మంచినీటి చెరువు పక్కన మరొక చెరువును మంచినీటి చెరువుగా మార్చినా ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బంది రాదని తెలిపారు. నీటి కొరత వల్ల గ్రామంలో ఉన్న ప్రైవేట్ ఫౌండేషన్ వాళ్లు కూడా నీరు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఈ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచిచూడాలి.

జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం

పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


తూర్పుపాలెంలో పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీమంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఇచ్చిన మాటకు కట్టుబడి మడమ తిప్పకుండా అమలు చేసే నాయకుడంటే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని, ప్రజలను మభ్య పెట్టి మోసం చేసే నాయకుడంటే చంద్రబాబు నాయుడని రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయిందని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం మండలంలోని తూర్పుపాలెంలో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ‘జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం’ పుస్తకాన్ని పార్టీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అరాచకాలు, దుర్మార్గాలు పెరిగిపోయాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని, తీవ్ర అధికార దుర్వినియోగం జరుగుతోందని తెలిపారు. తప్పుడు కేసులు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. చంద్రబాబు మరోసారి మేనిఫెస్టోతో మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందన్నారు. కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర రాజధాని నుంచి గ్రామ స్థాయి వరకు కక్షసాధింపు రాజకీయాలే చేస్తున్నారన్నారు.

యథేచ్ఛగా ఇసుక, మట్టి దోపిడీ..

ఇసుక, మట్టి దోపిడీతో ఖజానా ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చెప్పారు. ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, మండల కన్వీనర్లు జక్కంశెట్టి చంటి, పిల్లి నాగన్న, గూడూరి దేవేంద్రుడు, సర్పంచ్‌లు సుంకర సీతారామ్, బుర్రా రవికుమార్, బోడపాటి బుల్లియ్య, నాయకులు కె.వేణుబాబు, బి.శ్రీనివాస వర్మ, జి.వీర బ్రహ్మం, కె.తాతాజీ, పి.శ్రీను, కె.కిరణ్, కె.వెంకటేశ్వరరావు, జి.సుబ్బారావు, ఎం.పండు, పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అరాచకం, అశాంతి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచకం, అశాంతి, ఆటవిక పాలన రాజ్యమేలుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు పెచ్చుమీరుతున్నాయని చెప్పారు. కుటుంబానికి పెద్ద ఎలా మార్గనిర్దేశకుడో రాష్ట్రానికి ముఖ్యమంత్రి అలాంటివారేనని, అటువంటి స్థానంలో ఉన్నవారే అవసరానికో అబద్ధం వల్లిస్తుంటే ఇక రాష్ట్ర ప్రజలు ఎవరితో మొరపెట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ‘జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం’ పుస్తకాన్ని పార్టీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో లా అండ్ ఆర్డర్ క్షీణించిపోయిందన్నారు. ప్రభుత్వం చేసే తప్పిదాలను ప్రశ్నిస్తుంటే ప్రతిపక్ష నాయకులతో పాటు సామాన్య ప్రజలను నోరెత్తకుండా కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చే పాత్రికేయులను సైతం రోడ్లపై తిరగనివ్వడం లేదన్నారు. రాష్ట్రంలో ఇంత అరాచక పాలన జరుగుతున్నా చంద్రబాబు మాత్రం ఏమీ తెలియనట్టు నటిస్తూ.. ఎక్కడా అవినీతి, అక్రమాలు జరగకూడదని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటారని విమర్శించారు. ఎన్ని అరాచకాలు సృష్టించినా, ఎంత భయాందోళనలకు గురిచేసినా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడంలో మాత్రం వైఎస్సార్‌సీపీ నేతలు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని గోపి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కుమార దత్తాత్రేయ వర్మ, ఎంపీపీ ఇనకొండ రవి, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు, నేతలు కోరాడ శ్రీనివాసరావు, ఉచ్చుల స్టాలిన్, కొత్రపాటి వీరాస్వామి, మామిడి బాబు, సనిశెట్టి లీలాభవన్నారాయణ, కుక్కల బాలచందర్, పాలపర్తి కృపానాథ్, ఉండ్రాజవరపు రవి, కెల్లా శ్రీను, శర్మ, బండి రమేష్, వీరా మల్లిఖార్జునరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, కర్రి జోగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాలుగు రోజుల క్రితం కారు ప్రమాదంలో మృతి చెందిన కుంపట్ల పెదరాజా కుటుంబ సభ్యులను గోపి పరామర్శించారు.

వెలగని వీధి దీపాలు.. అంతటా అంధకారం

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు నాగారమ్మ గుడి కాలువ గట్టు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు సవ్యంగా వెలగడం లేదు. వేసవి మొత్తం ఇదే పరిస్థితి నెలకొని ఉందని, రాత్రిపూట వీధిదీపాలు వెలగక, మరోవైపు దొంగల భయంతో ఆందోళన చెందామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి వీధిదీపాలు వెలిగించాలని కోరుతున్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం

మున్సిపల్ కమిషనర్

నరసాపురం: పట్టణంలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సోమవారం తెలిపారు. వేసవి ప్రభావంతో చెరువుల్లో నీరు అడుగంటడంతో నాలుగురోజుల నుంచి పట్టణంలో కుళాయిల ద్వారా ఒక్కపూటే నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై స్పందించిన కమిషనర్.. కాలువలకు నీటిని విడుదల చేశారని, మున్సిపాలిటీలోని మంచినీటి చెరువును నింపే పనులు సోమవారం ప్రారంభించామని తెలిపారు. రెండు రోజుల్లో చెరువును పూర్తిగా నింపేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఆ వెంటనే కుళాయిల ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ముంపును తట్టుకునే రకాలనే సాగు చేయాలి

ఏడీఏ ఈదా అనిల్ కుమారి

నరసాపురం రూరల్: నరసాపురం సబ్ డివిజన్‌లోని నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు మండలాల్లోని రైతులంతా సార్వా వరి సాగులో మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన వరి వంగడాలను మాత్రమే సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ఈదా అనిల్ కుమారి సూచించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ మండలాల్లోని వరి భూములు అధిక వర్షాలకు ప్రతి ఏటా ముంపు బారిన పడుతున్నాయని తెలిపారు. దీంతో ముంపును తట్టుకునే వరి రకాలైన ఎంటీయూ–1232 (140 రోజులు) ఎంటీయూ–1100 (140 రోజులు)లను సాగు చేయాలని చెప్పారు. చౌడును తట్టుకునే రకాలైన ఎంసీఎం–100 ఎంసీఎం–1293 రకాలు సాగు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ లోపు అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకాలకు అర్హులైన రైతులు తమ రైతు సేవా కేంద్రాల్లో విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కౌలు రైతులు తమ యజమానులను సంప్రదించి ప్రస్తుత సీజన్‌కు కౌలు రైతు కార్డులు పొందాలన్నారు.

వయో వృద్ధులకు రక్షణ కల్పించండి

తహసీల్దారుకు సీనియర్ సిటిజన్ల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

పాలకొల్లు సెంట్రల్: కొన్ని కుటుంబాల్లో వయో వృద్ధులకు రక్షణ లేకుండా పోతోందని స్థానిక సీనియర్ సిటిజన్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడు వంగా నరసింహారావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వృద్ధులకు రక్షణ కల్పించాలని కోరుతూ తహసీల్దారు వై.దుర్గాకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంగా నరసింహారావు మాట్లాడుతూ కొన్ని కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రులను వదిలించుకోవడానికే చూస్తున్నారని వాపోయారు. తనకు ఇంట్లో సమస్య ఉందని వృద్ధులు చెప్పుకొంటుంటే ఆ సమాచారం ఏదోలా తన పిల్లలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి సమస్య మరింత ఎక్కువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు మరీ దారుణంగా వ్యవహరిస్తున్నారని, తీర్థయాత్రలకు తీసుకువెళుతున్నామని చెప్పి అక్కడ వదిలేసి వచ్చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి సమస్యల నుంచి వృద్ధులను రక్షించాలని తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాగం బాలకొండలరావు, అత్యం ఆదిశేషారావు, కొండ్రెడ్డి సూర్యనారాయణ, యర్రంశెట్టి వెంకటరత్నం, కారుమూరి దుర్గాప్రసాద్, డి.రామకృష్ణంరాజు, ఐడియల్ స్కూల్ సుబ్బారావు, రాయి సూరిబాబు, పోకల నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!

- దుర్గంధంలోనే హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని కమిషనర్


పెదపేటలోని సాంఘికసంక్షేమ శాఖ హాస్టల్ ప్రాంతంలో మురుగునీరు

ఆకివీడు: స్థానిక పెదపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వద్ద డ్రెయినేజీ మురుగునీరు నేరుగా హాస్టల్ ప్రాంగణంలోకి రావడంతో దుర్గంధం భరించలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్ స్థానిక ఈ హాస్టల్‌ను, అదే ప్రాంతంలో ఉన్న సచివాలయ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో డ్రెయినేజీ నీరు ఆయా ప్రాంగణాల్ని ముంచెత్తడంతో విద్యార్థులు ఏవిధంగా ఇక్కడ నివసిస్తారని కమిషనర్‌ను కలెక్టర్ నిలదీశారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ మారడంతో సమస్య పరిష్కారం కాలేదు. దుక్కి వర్షానికి డ్రెయినేజీలోని మురుగు నీరు హాస్టల్ ప్రాంగణం, సచివాలయ ప్రాంగణంను ముంచెత్తుతోంది. మురుగు నీరు హాస్టల్ ప్రాంగణంలో నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సచివాలయ సిబ్బంది కూడా ముక్కులు మూసుకుని పనులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. స్వచ్ఛ ఆకివీడు కార్యక్రమాలతో పాటు ప్రతి నెలా డ్రైడే నిర్వహిస్తున్నారని, నెలకు ఒకసారి మండల స్థాయి అధికారులు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యల్ని తెలుసుకుంటున్నా కంపు, మురుగు నీరు పోయేందుకు మాత్రం చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ప్రస్తుత కలెక్టర్ నాగరాణి స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు గమనించాలి


జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రావు

నరసాపురం: విద్యావ్యవస్థలో రోజురోజుకూ వస్తున్న మార్పులు, సంస్కరణలను విద్యార్థులు సునిశితంగా గమనించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావు సూచించారు. సోమవారం వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాలులో కళాశాల ఐక్యూఏసీ సెంటర్ ఆధ్వర్యంలో ‘విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, సంస్కరణలు’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల కాలంలో బోధనా వ్యవస్థలో ఆన్‌లైన్ లెర్నింగ్ ప్రాముఖ్యత పెరిగిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అధ్యాపకులు కూడా నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. నూతన విద్యాబోధనల వైపు దృష్టి సారించాలని చెప్పారు. ఈ సదస్సులో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అందే రామసతీష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

వెర్టాక్ సేవలు అభినందనీయం


కాళ్లలో సోలార్ వీధిలైట్లు ప్రారంభిస్తున్న వెర్టాక్ ఆర్‌బీఎం సత్యనారాయణ తదితరులు

కాళ్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ‘వెర్టాక్’ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పెద్దలు అన్నారు. కాళ్ల గ్రామంలో ‘వెర్టాక్’ సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లను సంస్థ రీజనల్ బిజినెస్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ, గ్రామస్తులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీకి వెళ్లాలంటే గ్రామస్తులు వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్నారని తమ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు గాదిరాజు కిరణ్ కుమార్ వర్మ, నారిన శ్రీనివాసరావు, వర్రె శివ తెలపడంతో సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు 50 లైట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో ఒక ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతోపాటు, సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన సంస్థకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ‘వెర్టాక్’ సంస్థ బిజినెస్ ఆఫీసర్ డీఎం రాజు, కిషోర్ నాయుడు, నారిన శ్రీనివాసరావు, బండారు నాని, సోమేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మరమ్మతులు


ఎన్నార్పీ అగ్రహారంలో వర్షంలో హైవేరోడ్డు ప్యాచ్ వర్కు చేస్తున్న దృశ్యం

ఉండి: హైవే మరమ్మతు పనులు తూతూమంత్రంగా సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా హైవే మరమ్మతుల పేరుతో నచ్చినట్లు గుంతలు పూడుస్తున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్న గుంతలను వదిలి వారికి సులువుగా మరమ్మతులు పూర్తయ్యేలా ఉన్న గోతులను మాత్రమే పూడ్చుతున్నారు. ఉండి నుంచి భీమవరం వరకు చేపట్టిన మరమ్మతుల్లో భాగంగా ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ పెట్రోల్ బంక్ వద్ద ప్యాచ్ వర్కు చేస్తుండగా సోమవారం సాయంత్రం భారీ వర్షం వచ్చింది. సుమారు అరగంట పాటు దంచి కొట్టింది. అయితే రోడ్డు పనులు మాత్రం ఆగకపోవడం గమనార్హం. భారీ వర్షంలో కొద్దిసేపు పనులు నిలిపిన కార్మికులు వర్షం ఆగకపోవడంతో అలాగే రోడ్డు ప్యాచ్‌వర్కులు చేసేసి సాయంత్రానికి పని ముగించేశారు. అంతంత మాత్రంగానే నాణ్యత కలిగిన పనులు చేస్తున్న ఈ రోజుల్లో వర్షంలో రోడ్డు ప్యాచ్ వర్కు చేస్తే దాని ప్రతిఫలం ఎలా ఉంటుందో ఊహించవచ్చు. రోడ్డు పక్కన వుండే బురద గానీ, నిలిచిన వర్షపు నీరు గాని మాకు అడ్డుకాదు అన్నట్టు కార్మికులు పనులు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో వాహనాదారులు, ప్రయాణికులు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజాధనాన్ని ఈ రకంగా వృథా చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్


కంతేరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఇరగవరం: కార్మికులకు ఉపాధి హామీ సంజీవని వంటిదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రం తెలిపారు. సోమవారం ఇరగవరం మండలంలోని కంతేరు గ్రామంలో పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి త తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బళ్ల చినవీరభద్రం మాట్లాడుతూ గత పది వారాల నుంచి పనిచేస్తున్నప్పటికీ కూలీ డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. మండుటెండలో ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరితో పని చేస్తున్న కూలీలకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోతే ఏలా బతకాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పని ప్రదేశంలో కూలీలతో యోగ చేయించడం మీద ఉన్నా శ్రద్ధ వేతనాలు చెల్లించడం మీద లేకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తక్షణం వేతన బకాయిలు చెల్లించాలని లేకుంటే కూలీలను కూలీలను ఐక్యం చేసి ఉద్యమ పోరాటలకు సిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల అప్పారావు, నూతంగి మణి, కాటూరి విజయలత, గుబ్బల రామకృష్ణ, అంపా వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని చినరంగనిపాలెం పుంతకుచెందిన డి. ప్రియాంకను కులం పేరుతో ఇద్దరు వ్యక్తులు తిట్టారని ఫిర్యాదు అందిందని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నించినా కుదరకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధిలోని అండర్‌పాస్ దగ్గర ద్విచక్రవాహనం జారిపడిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఒకటో పట్టణం చినరంగనిపాలేనికి చెందిన పి.వెంకటేశ్వరరావు (59) ఈ నెల 5న ద్విచక్రవాహనంపై వెళ్తూ అండర్ పాస్ వద్ద జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును మెరుగైన చికిత్సకు కాకినాడలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.